ప్రజాశక్తి
మంగళవారం 3 జనవరి 2023
5



పార్వతీపురం మన్యం

పెద్ద పోలమాంబ ఘటాలకు వెండి పూత

ప్రజాశక్తి - మక్కువ

ఉత్తరాంధ్ర ఆరాధ్య దేవతగా పేరొందిన శంబర పోల మాంబ అమ్మవారి మేనత్త పెద పోలమాంబ అమ్మవారి ఘటాలకు సోమవారం వెండి పూత పూశారు. అనంతరం అమ్మవారి ఘటాలను పెంట కుటుం బీకులు ఊరేగిం చారు. ఈ సందర్భంగా అమ్మవారి ఘట్టాలకు పెద్ద ఎత్తున పూజలు చేశారు. సోమవారం రాత్రి పెదపోలమాంబకు తోలేళ్ల ఉత్సవం నిర్వహిస్తారు. బుధవారం అంపకం జరుపుతారు. ఆ తర్వాత పోలమాంబ అమ్మవారి జాతరకు చాటింపు వేయనున్నట్లు గ్రామ పెద్దలు తెలిపారు.



ఘటాలకు పూజలు చేస్తున్న మహిళలే



కళ్లంలో ఉన్న ధాన్యం బస్తాలు

రైతులను దోచేస్తున్నారు!

తేమ శాతంలో గోల్‌మాల్

అదనపు ధాన్యం తీసుకుంటున్న మిల్లర్లు

కళాసీ ఛార్జీలలో అక్రమాలు

ఆరుగాలం కష్టపడి పండించిన పంటను అమ్ముకునే సమయంలోనూ రైతులకు పాట్లు తప్పడం లేదు. ధాన్యం రైతులను మిల్లర్లు నిలువునా దోచేస్తున్నారు. తేమ శాతంలో మిల్లర్లు అక్రమాలకు పాల్పడుతున్నారు. రైతులు అదనంగా ధాన్యం ఇస్తేనే రైతు భరోసా కేంద్రాల నుంచి తీసుకెళ్తున్న ధాన్యాన్ని మిల్లర్లు తీసుకుంటున్నారు. మరోవైపు కళాసీ ఛార్జీల్లోనూ మిల్లర్లు కక్కుర్తి పడుతున్నారు. రైతుల నుంచి బస్తాకు రూ.5 వసూలు చేసి, కళాసీలకు రూ.3.36 మాత్రమే ఇస్తూ దోపిడీ చేస్తున్నారు.

ప్రజాశక్తి-బొబ్బిలి

రైతు భరోసా కేంద్రాలలో 16 శాతం తేమ శాతం వస్తే మిల్లర్లు 20 శాతం చూపించి అదనంగా ధాన్యాన్ని తీసుకుంటున్నారు. ప్రతి రైతు భరోసా కేంద్రంలో తేమ శాతాన్ని చూసిన తర్వాత రైసుమిల్లులకు ధాన్యాన్ని పంపిస్తే, అవే ధాన్యానికి తేమలో తేడా వస్తుంది. మిల్లర్లు తేమ శాతం పరీక్షించగా రైతు భరోసా కేంద్రం కంటే మిల్లర్ల వద్ద మరో మూడు శాతం తేమ ఎక్కువ చూపిస్తుంది. దీంతో రైతులు క్వింటాకు 5 నుంచి 8 కిలోలు అదనంగా ధాన్యం ఇస్తేనే మిల్లర్లు తీసుకుంటున్నారు. గత్యంతరం లేక రైతులు అదనంగా ధాన్యాన్ని మిల్లర్లకు ఇస్తున్నారు.

కళాసీ ఛార్జీల వసూలు

కళాసీ ఛార్జీలలో మిల్లర్లు అక్రమాలకు పాల్పడుతున్నారు. మిల్లుల వద్ద వాహనాల నుంచి ధాన్యం అన్‌లోడింగ్ చేసేందుకు రైతుల నుంచి బస్తాకు కళాసీ ఛార్జి పేరుతో రూ.5 వసూలు చేస్తున్నారు. కళాసీలకు రూ.3.36 చెల్లించి, మిగిలిన డబ్బులను మిల్లర్లు మింగేస్తున్నారు. రైతుల నుంచి వసూలు చేస్తున్న మొత్తం డబ్బులు కళాసీలకు చెల్లించాల్సి ఉన్నా ఎక్కడా చెల్లించడం లేదు. కళాసీలకు ఎంత ఇస్తున్నారో అంత డబ్బులు మాత్రమే వసూలు చేయాల్సిన మిల్లర్లు అదనంగా ఎందుకు వసూలు చేస్తున్నారని రైతులు ప్రశ్నిస్తున్నారు.

కళాసీల సమ్మె

రైసుమిల్లుల్లో పనిచేసే కళాసీలకు వేతనాలు పెంచేందుకు మిల్లర్లు ముందుకు రావడం లేదు. రైతుల నుంచి బస్తాకు రూ.5 వసూలు చేస్తున్న మిల్లర్లు మాత్రం కళాసీలకు వేతనాలు పెంచడం లేదు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా కూలి రేట్లు పెంచకపోవడంతో కళాసీలు ఆదివారం నుంచి సమ్మెబాట పట్టారు. కళాసీలు సమ్మెలో ఉండడంతో ధాన్యం కొనుగోలు నిలిచిపోయింది. ప్రభుత్వం స్పందించి పెరుగుతున్న ధరలకు అనుగుణంగా కూలి రేట్లు పెంచేలా చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

రైతు నుంచి తీసుకుని కళాసీలకు ఇవ్వడం లేదు



వ్యవసాయం, కళాసీ పని చేసుకుని జీవనం సాగిస్తున్నాం. ధాన్యాన్ని రైసుమిల్లుకు తరలిస్తే బస్తాకు రూ.5 వసూలు చేస్తున్నారు. కళాసీ పని చేసుకుని రైతులు తెచ్చిన ధాన్యాన్ని దించితే రూ.3.36 మాత్రమే ఇస్తున్నారు. పెరుగుతున్న ధరలతో మేము ఎలా బతికేది? పెరుగుతున్న ధరలకు అనుగుణంగా కూలి రేట్లు పెంచాలి.

- పైల రామకృష్ణ, గొల్లపల్లి

కళాసీల సమ్మెకు సిఐటియు మద్దతు

నూతన వేతన ఒప్పందం చేయాలని కళాసీలు చేస్తున్న సమ్మెకు సిఐటియు జిల్లా అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు పి.శంకరరావు, కె.సురేష్ సంపూర్ణ మద్దతు ప్రకటించారు. నిత్యావసర సరుకుల ధరలు విపరీతంగా పెరుగుతున్నా కళాసీల వేతనాలు పెంచేందుకు వ్యాపారులు, మిల్లర్లు ముందుకు రాకపోవడం అన్యాయమని పేర్కొన్నారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా వేతనాలు పెంచాలని డిమాండ్ చేశారు.

చర్చలు విఫలం

ప్రజాశక్తి-బొబ్బిలిరూరల్

వేతన ఒప్పందంపై రైస్ మిల్లర్లు, కళాసీ సంఘం మధ్య జరిగిన వేతన ఒప్పంద చర్చలు విఫలమయ్యాయి. తహశీల్దార్ రాజారావు సమక్షంలో సోమవారం చర్చలు జరిగాయి. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా పాత వేతన ఒప్పందంపై 30 శాతం పెంచాలని పట్టణ కళాసీ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు బి.అప్పలస్వామి, డి.వర్మ డిమాండ్ చేశారు. 26శాతం వేతనం పెంచి మూడేళ్లు అగ్రిమెంట్ చేసుకోవాలని మిల్లర్లు కోరారు. 26 శాతం వేతనాలు పెంచి రెండేళ్లు ఒప్పందం చేయాలని కళాసీలు కోరగా, మూడేళ్ల ఒప్పందానికి మిల్లర్లు పట్టుబట్టారు. దీంతో చర్చలు వాయిదా పడ్డాయి. వేతన ఒప్పందం చేయకపోతే లోడింగ్, అన్ లోడింగ్ అడ్డుకుంటామని కళాసీలు హెచ్చరించారు. చర్చల్లో సిఐటియు డిటి సాయికృష్ణ, కళాసీ సంఘం న్యాయ సలహాదారు ఎం.జగన్నాథం ఉన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి రెడ్డి వేణు

హైడ్రో పవర్ ప్రాజెక్టు అనుమతులు రద్దు చేయాలి : సిపిఎం

ప్రజాశక్తి - సాలూరురూరల్

మండలంలోని కురుకూటి హైడ్రో పవర్ ప్రాజెక్ట్ అనుమతులు రద్దు చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి రెడ్డి వేణు అన్నారు. మండలంలో కురుకుట్టి వద్ద అదాని సంస్థ తరపున నెలకొల్పుతున్న హైడ్రో పవర్ ప్రాజెక్ట్ పరిధిలోని నిర్వాసితులైన గిరిజనుల సమస్యలపై సిపిఎం మండల కమిటీ ఆధ్వర్యంలో సోమవారం కురుకూటిలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కురుకూటి పంచాయతీలో 1200 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి చేయాలని హైడ్రోపవర్ ప్రాజెక్టు నిర్మాణం కోసం ఏడు గిరిజన గ్రామాలను తొలగించి 638 ఎకరాల్లో పవర్ ప్రాజెక్టు కట్టి అదానికి అప్పజెప్పాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రయత్నిస్తున్నాయని తెలిపారు. ఈ ప్రయత్నాలను తక్షణమే ఆపాలని, అక్రమంగా ఇచ్చిన అనుమతులను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. పవర్ ప్రాజెక్టు వల్ల ఏడు గిరిజన గ్రామాల ప్రజలు నిర్వాసితులైపోతారని ఆందోళన వ్యక్తం చేశారు. కొట్టియా గ్రామాలకు రోడ్డు సౌకర్యం కూడా ఉండదన్నారు. గ్రామ సభల అనుమతి లేకుండా ఏకపక్షంగా అనుమతులివ్వడం సరికాదని తెలిపారు. కావున ఇచ్చిన అనుమతులను వెంటనే రద్దు చేయాలని కోరారు. లేనిచో గిరిజనులను కూడగట్టి పోరాటాలు ఉధృతం చేస్తామని తెలిపారు. కావున ఇప్పటికైనా అక్రమంగా ఇచ్చిన అనుమతులను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి మర్రి శ్రీనివాసరావు, మండల కమిటీ సభ్యులు సీదరపు అప్పారావు, గెన్నెల జానకిరావు, వంతల సుందర్రావు, కూనేటి చినబాబు, తాడంగి గాసి, చింత లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



ఘటనా స్థలంలో వివరాలు సేకరిస్తున్న పోలీసులు

కీచకులు

చిన్నారులు, మతిస్థిమితం లేని వారితోపాటు వృద్ధులపై కామాంధులు మద్యం మత్తులో లైంగికదాడులకు పాల్పడుతున్నారు. తాజాగా మండల కేంద్రానికి కూత వేటు దూరంలోగల కిమ్మి గ్రామంలో నాలుగో తరగతి చదువుతున్న తొమ్మిదేళ్ల బాలికపై అదే గ్రామానికి చెందిన కామాంధుడు లైంగికదాడికి పాల్పడ్డాడు. ఆదివారం సాయంత్రం జరిగిన ఈ సంఘటన సోమవారం ఉదయం వెలుగు చూసింది. ఈఘటనతో మండల ప్రజలు ఒక్కసారిగా ఉలిక్కిపడ్డారు. మండలంలో తరచూ ఇటువంటి ఘటనలు జరగడంతో చిన్నారుల తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు.

వరుస ఘటనలతో తల్లిదండ్రుల ఆందోళన

ప్రజాశక్తి-వీరఘట్టం

గ్రామంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో నాలుగో తరగతి చదువుతున్న బాలిక ఆదివారం సాయంత్రం గ్రామ సమీపంలో గల నాగావళి నది ఒడ్డుకు బహిర్భూమి కోసం వెళ్లింది. అదే గ్రామానికి చెందిన గురాన గౌరు నాయుడు (50) మార్గమధ్యలో కాపుకాసి మాయ మాటలు చెప్పి శ్మశాన వాటిక పరిసరాల్లోకి తీసుకెళ్లి లైంగిక దాడి చేశాడు. అస్వస్థతకు గురైన బాలికను చికిత్స కోసం పాలకొండ ప్రాంతీయ ఆసుపత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న పార్వతీపురం మన్యం జిల్లా దిశ సెల్ డిఎస్‌పి హర్షిత, పాలకొండ డిఎస్‌పి జివి కృష్ణారావు ఆసుపత్రికి చేరుకొని బాలిక ఆరోగ్యంపై ఆరా తీశారు. నిందితుడ్ని అదుపులోకి తీసుకొని పోక్సో కేసు నమోదు చేశారు. సమగ్ర శిక్షాభియాన్ ఎఎంఒ రాజేశ్వరి, ఎంఇఒ సిహెచ్.రత్నాకర్ ఆస్పత్రికి చేరుకుని విద్యార్థినితో మాట్లాడారు. అనంతరం పాఠశాల, బాధితురాలి ఇంటికి వెళ్లి ఆరా తీశారు. గౌరునాయుడుకు భార్య ఉంది. పిల్లలు లేరు. చెడు వ్యసనాలకు బానిసయ్యాడు. గ్రామంలో మద్యంతో పాటు నాటుసారా ఏరులై పారుతోంది. దీంతో రోజూ మద్యం తాగుతూ జులాయిగా తాగుతున్నాడు. ఈనేపథ్యంలోనే బాలికపై లైంగిక దాడికి పాల్పడినట్లు తెలుస్తోంది.

గత ఏడాది డిసెంబరు 13న వీరఘట్టం మండల కేంద్రంలోని పాత పోస్టాఫీసు వద్ద మతిస్థిమితం లేని మహిళపై కామాంధులు మద్యం మత్తులో లైంగిక దాడి చేశారు. అప్పట్లో పోలీసులు స్పందించి లైంగిక దాడికి గురైన మహిళను వీరఘట్టం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం తీసుకువెళ్లి చికిత్స అందించి అనంతరం శ్రీకాకుళం జిల్లా కేంద్రంలోని హోంకేర్‌కు తరలించారు. ఇదే మండలం 2021 నవంబర్ 4న నడుకూరు గ్రామానికి చెందిన 11 ఏళ్ల బాలికపై అదే గ్రామానికి చెందిన ఓ వ్యక్తి లైంగిక దాడి చేశాడు. మండలంలో వరుస బాలికలపై లైంగిక దాడులు చేయడంతో పిల్లల తల్లిదండ్రులు భమాందోళనకు గురవుతున్నారు.

నవోదయ ప్రవేశాలకు నోటిఫికేషన్

ప్రజాశక్తి-శృంగవరపుకోట

మండలంలోని కిల్తంపాలెం వద్దనున్న జవహర్ నవోదయ కేంద్రీయ విద్యాలయంలో ప్రవేశాల కోసం నోటిఫికేషన్ విడుదల చేసినట్లు ప్రిన్సిపల్ వి.దుర్గాప్రసాద్ తెలిపారు. సోమవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ విజయనగరం జిల్లాలో నివశిస్తూ 2022-23 విద్యా సంవత్సరంలో ఈ జిల్లాలో ఐదో తరగతి చదువుతున్న విద్యార్థులు ఇందుకు అర్హులని పేర్కొన్నారు. దరఖాస్తు చేసుకునేందుకు ఈ నెల 31 చివరి తేదీ కాగా, ఏప్రిల్ నెల 29న పరీక్ష నిర్వహిస్తున్నట్లు చెప్పారు. వివరాలకు www.navodaya.gov.in వెబ్‌సైట్‌ను సంప్రదించాలని కోరారు.

కిల్కార్ ద్వారా గర్భిణీలు, శిశు ఆరోగ్యంపై అవగాహన

ప్రజాశక్తి - కలెక్టరేట్

కిల్కార్ (పిలుపు) వాయిస్ ద్వారా గర్భిణీలు, శిశు ఆరోగ్యంపై అవగాహన కల్పించడం జరుగుతోందని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ బగాది జగన్నాధరావు తెలిపారు. కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ మంత్రిత్వశాఖ కిల్కార్ వాయిస్‌లో నాలుగు విభాగాల్లో సాంకేతిక, ఆరోగ్య సందేశాలను అందించడం జరుగుతోందన్నారు. కిల్కార్ ఐవిఆర్ రికార్డింగ్ ద్వారా 72 సందేశాలు అందిస్తుందని, ఇందులో గర్భిణీలు, శిశు ఆరోగ్యం, ఆసుపత్రి ప్రసవాలుపై సందేశాలు మొబైల్ ఫోన్ ద్వారా వినిపిస్తుందని చెప్పారు. ఇది ఆరు వారాలు పాటు 012 4458800 ఫోన్ నెంబరు నుంచి గర్భిణీలకు, బాలింతలకు కాల్ చేసి సాంకేతిక ఆరోగ్య సందేశాలను ఇస్తుందని వివరించారు. ఫోన్ లిఫ్ట్ చేయకపోతే 14423 ఫోన్ కు కాల్ చేయ వచ్చని చెప్పారు. ఆశా కార్యకర్తలు గర్భిణీలకు “కిల్కారి” పై అవగాహన కల్పించాలని ఆయన ఆదేశించారు. ఇందులో అందిన వివరాలు ప్రజా స్పందనగా సమర్పించబడతాయన్నారు.

హేండ్‌బాల్‌లో విద్యార్థులు ప్రతిభ

ప్రజాశక్తి - పార్వతీపురంరూరల్

కదిరిలో జరిగిన రాష్ట్రస్థాయి హేండ్‌బాల్ అండర్-14 పోటీల్లో విజయనగరం జట్టు రన్నర్‌గా నిలిచింది. జట్టుకు కెప్టెన్‌గా వ్యవహ రించిన పార్వతీపురం శ్రీచైతన్య పాఠశాలకు చెందిన సబ్బాన నిత్యశ్రీని సోమవారం ప్రిన్సిపల్ వై.రామకృష్ణ, డీన్ పి.సుదర్శన్, ఇన్‌చార్జీ ఎం.రవికుమార్ అభినందించారు. నిత్యశ్రీతో పాటు నర్సిపురం జెడ్‌పి ఉన్నత పాఠశాలకు చెందిన ఎన్‌జ్యోత్స్న, వి.మహేశ్వరి, టి.భాగ్య నేషనల్‌మీట్‌కు ఎంపికయ్యారు.



విద్యాబోధన గురించి అడిగి తెలుసుకుంటున్న ఎన్‌సిఇఆర్‌టి రాష్ట్ర సమన్వయకర్త శ్రీరామ్మూర్తి

విద్య ప్రమాణాల మెరుగుకు బోధనే కొలమానం

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

పాఠశాలల్లో విద్యా ప్రమాణాల మెరుగుకు ఉపాధ్యాయుల బోధనే కొలమానమని, అందుకు ఉపాధ్యాయులు తగిన కృషి చేయాలని ఎస్‌సిఇఆర్‌టి స్టేట్ కోఆర్డినేటర్ ఇ. శ్రీరామ్మూర్తి అన్నారు. ప్రపంచ బ్యాంకు నిబంధనలను అనుసరించి ఎస్‌సిఇఆర్‌టి సౌజన్యంతో రాష్ట్రంలో 444 ప్రాథమిక ప్రాథమిక, ప్రాథమికోన్నత, గిరిజన సంక్షేమ పాఠశాలల్లో విద్యా ప్రమాణాలను పరిశీలించేందుకు మండలానికి వచ్చానన్నారు. ఈ మండలంలో తాను మూడు రోజుల పాటు ఆరు పాఠశాలలను పరిశీలించి నివేదికలను ఎస్‌సిఇఆం టికి సమర్పిస్తామని అన్నారు. పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పన, విద్యార్థులకు విద్యా ప్రమాణాల పరిశీలన, మధ్యాహ్న భోజన పథకం నిర్వహణ, మరుగుదొడ్ల నిర్వహణ తదితర వసతులను పరిశీలించి నివేదికలను ప్రభుత్వానికి అందిస్తామని తెలిపారు. ఈ మేరకు సోమవారం మండల కేంద్రంలోని చింతలగూడ వీధిలో గల ఎయిడెడ్ ప్రాథమిక పాఠశాలను పరిశీలించానని అన్నారు. పాఠశాలలో 45 నిమిషాల పాటు ఉపాధ్యాయుల బోధనను పరిశీలించి మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించానన్నారు. అలాగే విద్యార్థు లను పలు రకాల ప్రశ్నలను అడిగి రాబట్టానని అన్నారు. అనంతరం పాఠశాల విద్యార్థుల తల్లిదండ్రులతో మాట్లాడి పాఠశాలలో ఉన్న విద్యాభివృద్ధి, వసతుల కల్పన గురించి అడిగి తెలుసుకున్నానని అన్నారు. అనంతరం మండలం లో గాజులగూడ, కుక్కిడి పాఠశాలను కూడా పరిశీలిస్తానన్నారు. ఆయన వెంట పాఠశాల మేనేజర్ బేత కృష్ణమూర్తి నాయుడు, హెచ్‌ఎం కుమారస్వామి, పాఠశాల విద్యా కమిటీ చైర్మన్ ఆరిక రవికుమార్ ఉన్నారు.

రక్తమోడిన రహదారులు

వేర్వేరు ప్రమాదాల్లో నలుగురు మృతి నలుగురికి తీవ్రగాయాలు

జిల్లాలో సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదాలతో రహదారులు రక్తమోడాయి. వేర్వేరు సంఘటనల్లో నలుగురు మృతి చెందగా, మరో నలుగురికి తీవ్రగాయాలయ్యాయి. ఒక్క కొమరాడ మండలంలో జరిగిన రోడ్డు ప్రమాదాల్లో ముగ్గురు మృత్యువాతపడగా, ఒకరు తీవ్రగాయాలతో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. అలాగే పార్వతీపురంలో ఒకరు మృతి చెందారు.



కొమరాడ : రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన హరికృష్ణ, చంద్రమ్మ

ప్రజాశక్తి - కొమరాడ

ప్రమాదవశాత్తు మలుపు వద్ద కమాండర్ జీపు బోల్తా పడి ఇద్దరు మృతి చెందిన సంఘటన మండలంలో చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని జాకూరు నుంచి కొమరాడ వస్తుండగా మార్గమధ్యలో ధాన్యం లోడుతో వస్తున్న జీపు మలుపు వద్ద అదుపుతప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదం జరిగిన సమయంలో జీపులో ముగ్గురు వ్యక్తులు ఉన్నారు. ఈ ప్రమాదంలో ఇద్దరు వ్యక్తులు అక్కడి కక్కడే మృతి చెందినట్లు ఎస్సై జగదీష్ నాయుడు తెలిపారు. ప్రమాదంలో మృతి చెందిన వారు అల్లువాడ గ్రామానికి చెందిన హిమరిక హరికృష్ణ (29), జాకోరు గ్రామానికి చెందిన కోలక చంద్రమ్మ (62) అక్కడికక్కడే మృతి చెందగా, మరొకరికి తీవ్ర గాయాలు అయ్యాయి. క్షతగాత్రుడ్ని పార్వతీపురం మన్యం జిల్లా ఆస్పత్రికి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు.

ట్రాక్టర్ బోల్తా వ్యక్తి మృతి

ట్రాక్టర్ బోల్తా పడి వ్యక్తి మృతి చెందిన ఘటన మండలంలో చోటుచేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని గుణాల గ్రామ సమీపంలో ఇటికి బట్టి వద్ద మట్టి కుమ్ముతున్న ట్రాక్టర్ బోల్తా పడి ఒడిశా రాష్ట్రానికి చెందిన డ్రైవర్ నాయక్ అనే వ్యక్తి మృతి చెందాడు. ప్రమాదవశాత్తు ట్రాక్టర్ మట్టిలో బోల్తాపడడంతో డ్రైవర్ అక్కడికక్కడే మృతి చెందాడు. విషయం తెలుసుకున్న పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ జగదీష్ నాయుడు తెలిపారు. మృత దేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పార్వతీపురం మన్యం జిల్లా ఆసుపత్రికి తరలించారు.

లారీ ఢీకొని మహిళ మృతి

పార్వతీపురం టౌన్ : లారీ ఢీకొని మహిళ మృతి చెందిన ఘటన సోమ వారం పట్టణంలో చోటు చేసుకుంది. పట్టణ ఎస్ఐ ఫకృద్దీన్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. పట్టణంలోని 25వ వార్డు రజక వీధికి చెందిన ధర్మవరపు గౌరి (52) తమ ఇంటి నుంచి ఉతికిన బట్టలను ఇచ్చేందుకు దీప్తి లాడ్జి కూడలి వైపు వెళ్తుండగా ఒడిశా నుంచి విశాఖ వైపు వెళ్తున్న లారీ ఢీకొట్టడంతో చక్రాల కిందపడి అక్కడికక్కడే మృతి చెందింది. ఆ ప్రాంతంలో ఉన్న స్థాని కులు పట్టణ పోలీసులకు సమాచారం ఇవ్వడంతో సిబ్బందితో సంఘటనా స్థలానికి వెళ్లి లారీ డ్రైవర్‌ను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేశారు.

ద్విచక్ర వాహనాలు ఢీకొని ముగ్గురికి గాయాలు

సీతంపేట : మండలంలో కారం కొత్తగూడెం సమీపంలో రెండు ద్విచక్ర వాహనాలు ఢీ కొట్టుకోవడంతో ముగ్గురికి గాయాలయ్యాయి. సీతంపేట నుండి పొల్ల సచివాలయం సెక్రటరీ సంతోషి విధులు నిర్వహించడానికి స్కూటీపై పొల్ల వెళ్తుండగా దోనుబాయి నుండి సీతంపేట వైపు రాజు, దేవి ద్విచక్ర వాహనాంపై వస్తున్నారు. కారం సమీపంలోకి వచ్చేసరికి ఎదురెదురుగా రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొట్టాయి. ఈ ప్రమాదంలో ముగ్గురూ గాయ పడ్డారు. స్థానికులు వెంటనే 108 వాహనం ద్వారా సీతంపేట ఏరియా ఆసుపత్రికి తరలించారు. అక్కడ పరిస్థితి విషమించడంతో పాలకొండ ఏరియా ఆసుపత్రికి సంతోషిని, శ్రీకాకు ళం రిమ్స్‌కు రాజు, దేవిలను తరలిం చారు. దీనిపై సీతంపేట ఎస్ఐ ఏ నీలకంఠరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. విషయం తెలుసు కున్న ఎంపిడిఒ గీతాంజలి, మండల విస్తరణాధికారి కొండపల్లి సత్యం, సెక్రటరీ సంఘం అధ్యక్షులు పాపారావు, కార్యదర్శి సుదర్శన్, గాయపడిన సచివాలయ సెక్రెటరీ సంతోషిని ఆసుపత్రిలో పరామర్శించారు.



లారీ చక్రాల కింద నలిగిపోయిన గౌరి

వికలాంగుల పట్ల ‘స్పందన’ కరువు

వినతులిచ్చేందుకు గంటల తరబడి నిరీక్షణ

ప్రజాశక్తి - కలెక్టరేట్

ప్రతి సోమవారం కలెక్టరేట్‌లో జరిగే స్పందన కార్యక్రమంలో వికలాంగుల నుంచి వినతులు స్వీకరించడానికి అధికారులెవరూ రాకపోవడంతో వీరు గంటకొద్దీ నిరీక్షించాల్సిన వచ్చింది. వికలాంగుల నుంచి వినతులు స్వీకరించేందుకు ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన స్పందనకు మధ్యాహ్నం 12:30 గంటల వరకు ఫిర్యాదులిచ్చేందుకు వీరు వేచిఉన్నారు. ఎట్టకేలకు మధ్యాహ్నం 12.30 గంటల తర్వాత డిఆర్‌ఒ జె.వెంకట్రావు వచ్చి వికలాంగుల నుంచి వినతులు స్వీకరించారు.



వినతులిచ్చేందుకు అధికారుల కోసం నిరీక్షిస్తున్న వికలాంగులు

పెన్షన్ ఇప్పించండి

సాలూరు మండలం పదో వార్డుకు చెందిన మండల సింహాచలంకు ఆరు నెలల నుంచి వికలాంగులు పెన్షన్ రావడంలేదని ఫిర్యాదు చేశారు. ఈ విషయమై సచివాలయ సిబ్బందిని సంప్రదిస్తే తన కార్డులో నలుగురు ప్రభుత్వ ఉద్యోగులు ఉన్నారని, అందువల్ల తనకు పెన్షన్ రావడంలేదని తెలిపారన్నారు. అయితే తనకు ఎవరూ లేరని, తాను ఒక్కడినే ఉంటున్నానని, తన కార్డులో ఉన్న నలుగురు వ్యక్తులు ఎవరో తనకు తెలియదని వారికి తనకు ఎటువంటి సంబంధం లేదని చెబుతున్నప్పటికీ ఎవరూ పట్టించుకోవడంలేదని ఆవేదన వ్యక్తం చేశాడు. ఆరు నెలల నుంచి పెన్షన్ రాకపోవడంతో ఇంటి అద్దె కట్టుకోలేక ఇల్లు ఖాళీ చేయాల్సి వచ్చి వీధుల్లో బిక్షం ఎత్తుకొని బతకాల్సిన పరిస్థితి ఏర్పడిందని సింహాచలం వాపోతున్నాడు. ఇప్పటికైనా అధికారులు తనపై దయతో తనకు పించన్ మంజూరు చేయాల్సిందిగా ప్రాధేయపడుతున్నాడు. పార్వతీపురం పట్టణానికి చెందిన డి.జగన్నాథం, కొమరాడ మండలం నాయుడువలసకు చెందిన ఎ.గంగునాయుడు సదరం సర్టిఫికెట్లు ఇప్పించాలని కోరారు. పార్వతీపురం మండలం అడ్డాపుశీల గ్రామానికి చెందిన జి.సింహాద్రి రెండేళ్లుగా పక్షవాతంతో బాధపడుతున్నానని పింఛను ఇప్పించాల్సిందిగా కోరారు.

ప్రజాశక్తి
www.prajasakti.com



కరాటేలో ప్రతిభ కనబర్చిన విద్యార్థులు

కరాటేలో కెజిబివి విద్యార్థినుల ప్రతిభ

పార్వతీపురంరూరల్ : మండలంలోని కవిటిభద్రలో కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం విద్యార్థినులు ఇటీవల విశాఖపట్నంలో జరిగిన సౌత్‌ఇండియన్ కరాటే పోటీల్లో ప్రతిభ కనబరిచినట్లు ప్రిన్సిపల్ సంధ్య తెలిపారు. పాఠశాలకు చెందిన 7,8 తరగతి విద్యార్థినులు బి.శామల (గోల్డ్‌మెడల్), బి.అమల, జానకి (రజతం), బి.అక్షయ (కాంస్యం) పతకాలు సాధించినట్లు ఆమె తెలిపారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు, సిబ్బంది వారికి అభినందనలు తెలియజేశారు.



యూనిఫాం అందిస్తున్న ఎంపిటిసి తవిటినాయుడు

చిన్నారులకు యూనిఫాం వితరణ

పార్వతీపురంరూరల్ : మండలంలోని నర్సిపురంలో ఎంపిటిసి–2 ఏగిరెడ్డి తవిటినాయుడు అంగన్‌వాడీ చిన్నారులకు యూనిఫాంలు ఉచితంగా అందించారు. సోమవారం జరిగిన కార్యక్రమంలో ఆయన అంగన్‌వాడీ కేంద్రంలో గల 20 మంది చిన్నారులకు తన సొంత ఖర్చులతో బట్టలు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిన్నారులకు ఏదోవిధంగా సాయపడాలి ఉద్దేశ్యంతో కార్యకర్త పార్వతిని సంప్రదించగా ఆమె సలహాలపై ఈ పంపిణీ నిర్వహించామని, తనకు ఎంతో సంతృప్తికలిగించిందని తెలిపారు.

మనయువత-మనభవిత గోడపత్రిక విడుదల

పార్వతీపురంరూరల్ : మండలంలోని వెంకంపేటలో జనసేన ఆధ్వర్యంలో మనయువత–మనభవిత కార్యక్రమానికి సంబంధించిన గోడపత్రికను ఆపార్టీ నాయకులు, కార్యకర్తలు సోమవారం విడుదల చేశారు. ఈ సందర్భంగా మండలపార్టీ అధ్యక్షులు ఆగూరు మణి మాట్లాడుతూ ఈనెల 12న శ్రీకాకుళం జిల్లా రణస్థలంలో జరుగనున్న యువశక్తి కార్యక్రమంలో అధికసంఖ్యలో జనసైనికులు పాల్గొనాలని పిలుపు నిచ్చారు.

ఎమ్మెల్యే అనుచిత వ్యాఖ్యలు వెనక్కి తీసుకోవాలి

కురుపాం : వికలాంగులు, వికలాంగులపై కర్నూలు జిల్లా ఎమ్మిగనూరు ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డి చేసిన అనుచిత వ్యాఖ్యలు వెంటనే వెనక్కి తీసుకోవాలని వికలాంగుల సంఘం డిమాండ్ చేసింది. ఈ సందర్భంగా సోమవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద వికలాంగుల సంఘం జిల్లా అధ్యక్షులు గడబంగి ఈశ్వరరావు మాట్లాడుతూ కర్నూలు జిల్లా సందరపరం మండలం పులిచింతలో భూహక్కు పత్రాల పంపిణీ కార్యక్రమానికి హాజరైన ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డి వికలాంగులు, వికలాంగులపై అనుచితమైన వ్యాఖ్యలు చేశారన్నారు. వీటిని వెనక్కి తీసుకోవాలని లేదంటే రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమానికి సిద్ధం అవుతామని హెచ్చరించారు.

అంగన్‌వాడీ కేంద్రం సందర్శన

నెల్లిమర్ల : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ చైర్మన్ కేసలి అప్పారావు, సభ్యులు గొండు సీతారాం రామతీర్థం అంగన్వాడీ కేంద్రం, సచివాలయాన్ని సోమవారం సందర్శించి బాలలకు ప్రభుత్వం అందిస్తున్న సేవలు, సౌకర్యాలపై ఆరా తీశారు. ఈ సంధర్భంగా అంగన్వాడీ కేంద్రంను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, సమయం ప్రకారం బోజనాలను పిల్లలకు పెట్టాలని నిరంతరం ఎత్తు, బరువు, కొలతలు నిర్వహించాలని సూచించారు. గర్భిణలు, బాలింతలకు, కేంద్రంలో పిల్లలకు కూడా వైద్య పరీక్షలు నిర్వహించాలని, రక్త హీనత లేకుండా చూడాలని నీరసంగా ఉన్న పిల్లలపై ప్రత్యేక దృష్టి సారించి సమతుల్య పౌష్టిక ఆహారం అందించాలని సూచించారు. సచివాలయంలో మహిళా పోలీస్, వెల్ఫేర్ అసిస్టెంట్, ఆరోగ్య కార్యకర్తతో బాలలకు సంబందించిన పలు అంశాలు చర్చించారు.. ప్రతీ సచివాలయ కేంద్రంలో బాలలకు సంబంధిన సంక్షేమ పథకాలు, బాల్య వివాహాలు, బాల కార్మికచట్టాలు, దిశ యాప్, అంశాలకు సంబంధించిన గోడ పత్రికలను ఏర్పాటు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో నెల్లిమర్ల ప్రాజెక్ట్ ఆఫీసర్ సత్యవతి పర్యవేక్షణ అధికారులు శకుంతల, జ్యోతి, పైడితల్లి అమ్మవారి పాలక మండలి సభ్యులు సత్తి అచ్చిరెడ్డి, సచివాలయం సిబ్బంది, అంగన్వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

జాతీయస్థాయి వెయిట్ లిఫ్టింగ్‌లో ప్రతిభ


ప్రజాశక్తి - నెల్లిమర్ల

జాతీయ స్థాయి వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో కొండ వెలగాడ క్రీడాకారులు ప్రతిభ కనబర్చి పతకాలు సాధించారు. సోమవారం కొండ వెలగాడకు చెందిన క్రీడాకారులు తమిళనాడు రాష్ట్రం నాగర్ కోయిల్‌లో జరుగుతున్న జాతీయ స్థాయి వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో ప్రతిభ కనబర్చి మరోసారి సత్తా చూపారు. ఈ పోటీల్లో 40కేజీలు విభాగంలో బెల్లాన భార్గవి కాంస్య పతకం, 45కేజీలు విభాగంలో వల్లూరి సుస్మిత రజత పతకం, 55కేజీల విభాగంలో తలచుట్ల లావణ్య కాంస్య పతకం, 59కేజీలు విభాగంలో బెల్లాన హారిక కాంస్య పతకం సాధించారు. ఈ సందర్భంగా జెడ్‌పిటిసి గదల సన్యాసినాయుడు, ఎంపిటిసి మొయిద కళావతి, గ్రామపెద్దలు మొయిద అక్కోజీ, కోచ్ బి.రవిని క్రీడాకారులు అభినందించారు.

అవ్వా, తాతలకు ఘనమైన కానుక : ఎమ్మెల్యే

ప్రజాశక్తి- డెంకాడ

అవ్వ తాతలకు ఘనమైన కానుకను ప్రభుత్వం పింఛను రూపంలో అందించిందని ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం నూతనంగా మంజూరైన 292 మందికి పింఛన్లను పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ సామాజిక పించన దారులకు సంక్రాంతి పండుగ ముందే వచ్చేసిందన్నారు. పింఛను రూ.250 పెంచి వితంతువులు, అవ్వతాతలకు ప్రభుత్వం ఘనమైన కానుక అందించిందన్నారు. అర్హత ప్రమాణికంగా పింఛన్ అందిస్తున్న ఘనత సిఎం జగన్మోహన్‌రెడ్డిదేనని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి బంటుపల్లి వెంకట వాసుదేవరావు, వైస్ ఎంపిపి పిన్నింటి తమ్మి నాయుడు, జెడ్‌పిటిసి బడ్డుకొండ లక్ష్మి, ఎంపిడిఒ డిడి స్వరూపరాణి, తహశీల్దార్ పి.ఆదిలక్ష్మి, పలు గ్రామాల సర్పంచులు, ఎంపిటిసిలు, వివిధ రాష్ట్ర కార్పొరేషన్ డైరెక్టర్లు నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.



బాధితులకు ఆర్థికసాయాన్ని అందజేస్తున్న జనసేన నాయకులు బాబు, మోహనరావు

బాధితులకు జనసేన ఆర్థిక సాయం

ప్రజాశక్తి - బలిజిపేట

మండలంలోని అజ్జాడలో ఇటీవల జరిగిన అగ్ని ప్రమాదంలో నష్టపోయిన బాధిత రైతులకు జనసేన రాష్ట్ర ప్రచార కార్యదర్శి బాబు పాలూరు, పార్వతీపురం నియోజకవర్గ నాయకులు అక్కివరపు మోహన్‌రావు ఆర్థిక సాయం చేశారు. మూడు రోజుల క్రితం అజ్జాడలో 10మంది రైతుల ధాన్యం, వరికుప్పలు కాలిపోయాయి. సోమవారం జనసేన నాయకులు పరామర్శించి వారికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఈ సందర్భంగా జనసేన నాయకులు మాట్లాడుతూ ప్రజలకు ఆపదొచ్చినప్పుడు ప్రభుత్వాలు ఆదుకోవాలి కానీ ఇప్పుడు వైసిపి ప్రభుత్వం ఎన్నికల్లో తిరిగి అధికారంలోకి వచ్చేయడానికి తాపత్రయం పడుతుందని, ప్రజలు ఇబ్బందులను మాత్రం పట్టించుకోవడంలేదని విమర్శించారు. అనంతరం జనసేన క్యాలెండర్ వాల్పోస్టర్ను విడుదల చేశారు.

కార్యక్రమంలో జనసేన మండల అధ్యక్షులు బంకురు పోలినాయుడు, నాయకులు స్వామి నాయుడు గంట్యాడ, రఘు,మండ్ల అప్పలనాయుడు, పరుచూరి వెంకటరమణ, శంబన హరిచరణ్, ప్రగడ కళ్యాణ్, సీతానగరం మండలం నాయకులు సూర్య, శ్రీను, అలాగే గ్రామ యువత, ఎంపిటిసి సభ్యులు పాల్గొన్నారు.

అర్జీలకు సరైన పరిష్కారం : కలెక్టర్

ప్రజాశక్తి -కలెక్టరేట్

స్పందనలో ప్రజలు పెట్టుకునే అర్జీలకు వారు సంతృప్తి చెందేలా సరైన పరిష్కారం చూపాలని కలెక్టరు నిశాంత్ కుమార్ అధికారులను ఆదేశించారు. సోమవారం స్థానిక కలెక్టరేట్‌లో ఐటిడిఎ పిఒ సి.విష్ణుచరణ్, డిఆర్ఒ జె.వెంకటరావుతో కలిసి స్పందన కార్యక్రమంలో ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. స్పందనలో 120 అర్జీలు అందాయి. స్వీకరించిన వినతుల్లో కొన్ని...

కొమరాడ మండలం మార్కొండపుట్టికి చెందిన జి.త్రినాధ్, ఇతరులు ఆర్ఆర్ ప్యాకేజీలో మంజూరైన నిర్వాసితులు గృహనిర్మాణం చేసుకున్న వారికి ఇంటి నిర్మాణ బిల్లులు మంజూరు చేయాలని దరఖాస్తు చేసుకున్నారు. కురుపాం మండలం లక్ష్మీనగర్‌లో ఇల్లు నిర్మించుకొనేందుకు పొజిషన్ సర్టిఫికెట్ మంజూరు ఇప్పించాల్సిందిగా ఐ.గౌరీశంకర్, ఇతరులు కోరారు. గరుగుబిల్లి మండలం కొంకడివరానికి చెందిన ఎ.అప్పలనాయుడు తమ గ్రామానికి అతి సమీపంలో ఉన్న ప్రధాన రహదారిని అనుకొని చెత్త సేకరణ కేంద్రం పెట్టడం వల్ల ప్రజలు ఇబ్బందికి గురవుతున్నారని, కావున చెత్త సేకరణ కేంద్రాన్ని వేరే ప్రాంతానికి తరలించమని దరఖాస్తు అందజేశారు. పార్వతీపురం పట్టణానికి చెందిన దామినేని గాయత్రి తన భర్త ప్రభుత్వ బాలికల హైస్కూల్‌లో వ్యాయామ ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నారని, రెండు నెలలుగా ఎంఇఒ జీతభత్యాలు నిలిపివేశారని, దీనివల్ల తాము కుటుంబం ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటుందని, వెంటనే జీతభత్యాలు అందజేయాలని అర్జీ అందజేశారు. భామిని మండలం బత్తిలికి చెందిన అప్పలనాయుడు 2019లో ఇల్లు మంజూరు చేశారని, ఇల్లు కట్టుకున్నానని కానీ తనకు ఇంత వరకూ బిల్లు జమ కాలేదు అని దరఖాస్తు అందజేశారు. సీతానగరం మండలం రెడ్డివానివలసలో గల భూమి



వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్ నిశాంత్‌కుమార్

జిరాయితి రిజిస్టర్ డాక్యుమెంటు ఉన్నాయని, మా భూమి రామవరం రెవెన్యూలో సర్వే నెంబర్ 1/7 డి పట్టాగా మారిందని, మా భూమిని మళ్లీ రీసర్వే జరిపి పట్టాదారు పాస్ పుస్తకం ఇప్పించాలని ఆర్. శివునాయుడు, ఇతరులు కోరారు. సీతానగరం గ్రామానికి చెందిన యల్.బుజ్జి జగనన్న ఇల్లు మంజూరు చేయాలని దరఖాస్తు అందజేశారు. మక్కువ మండలం చెముడుకు చెందిన జి.భూషణరావు వెంగళరాయి సాగర్ కుడి ప్రధాన కాలువ పై మాదుము మంజూరు చేయాలని కోరారు. కార్యక్రమంలో వివిధశాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

స్పందనకు 25 వినతులు

సీతంపేట : సీతంపేట ఐటిడిఎ స్పందనకు 25 వినతులు వచ్చాయి. ఈ స్పందన కార్యక్రమం పిఒ బి. నవ్య ఆధ్వర్యంలో ఐటిడిఎ కార్యాలయంలో సోమవారం నిర్వహించారు. వజ్జాయిగూడ గ్రామానికి చెందిన సవర సుశీల కుట్టుమిషన్ ఇప్పించాలని, పాండ్రర అక్కన్న గూడకు తాగునీటి సదుపాయం కల్పించాలని భుజంగరావు విన్నవించారు. కోనంగి గ్రామానికి చెందిన చంద్రావు విద్యుత్ స్తంభాలు వేయాలని, గుర్రాల మెట్టకు చెందిన మల్లేష్ కిరాణా షాప్‌కు లోను ఇప్పించాలని, కొండ ఆదివాసి దింస సంస్కృత నాట్య మండలి బృందానికి సామాగ్రి మంజూరు చేయాలని విన్నవించారు. ఈ స్పందన కార్యక్రమంలో ఎపిఒ రోషిరెడ్డి, జిసిసి డిఎం సంధ్యారాణి, సిడిపిఒ రంగలక్ష్మి, ఎడిఒ తిరుమలరెడ్డి తదితరులు పాల్గొన్నారు

జిసిసి డిపోలు తనిఖీ

మండలంలోని జిసిసి డిపోలను ఐటిడిఎ పిఒ బి.నవ్య సోమవారం తనిఖీ చేశారు. మండలంలోని గొయిది, సీతంపేట ప్రధాన డిపోలను ఆమె తనిఖీ చేశారు. ఈ సంధర్భంగా డిపోలో రేషన్ తీసుకొంటున్న లబ్ధిదారులతో ఆమె మాట్లాడారు. ప్రతీ నెలా డిపో నుంచి సరుకులు అందుతున్నాయా లేదా అని అడిగి తెలుసుకున్నారు. ఎమ్‌డియు వాహనాల ద్వారా పంపిణీ చేస్తున్న బియ్యం ఇంటింటికి వచ్చి ఇస్తున్నారా అనే వివరాలు తెలుసుకొన్నారు. దీనికి లబ్ధిదారులు వాహనాల ద్వారా తమ ఇంటికే వచ్చి బియ్యం అందిస్తున్నారని తెలిపారు. పంపిణీలో ఏమైనా సమస్యలు ఉన్నాయా అని లబ్దిదారులను అడిగారు. ఈ సందర్భంగా డిపోలో రికార్డులను, స్టాక్‌ను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో జిసిసి డిఎం సంధ్యారాణి, ఇతర జిసిసి సిబ్బంది పాల్గొన్నారు.



సిబ్బందితో మాట్లాడుతున్న పిఒ నవ్య

కొత్తగా మంజూరైన పింఛన్ల పంపిణీ

ప్రజాశక్తి- జియ్యమ్మవలస

మండలంలోని నూతనంగా మంజూరైన పింఛన్లను ఎమ్మెల్యే పి. పుష్పశ్రీవాణి పంపిణీ చేశారు. సోమవారం చిన్న మేరంగిలో తన క్యాంప్ కార్యాలయంలో పెదమేరంగి గ్రామానికి చెందిన నూతన పింఛనర్లకు తన చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వృద్ధాప్య వితంతువులకు ప్రభుత్వం భరోసానిస్తూ జనవరి నుండి రూ.2,750 పింఛను అందజేస్తున్నారని చెప్పారు. అర్హులంతా ప్రభుత్వ పథకాలు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే కోరారు. ఈ కార్యక్రమంలో జెడ్‌పిటిసి ఎం. శశికళ, ఎంఎస్ఎంఇ డైరెక్టర్ ఎం. గౌరీ శంకర్రావు, ఎంపిటిసి జి.సంపత్ కుమార్, సర్పంచ్ రాయిపల్లి అనురాధ పాల్గొన్నారు.



జియ్యమ్మవలస: పింఛన్లు అందిస్తున్న ఎమ్మెల్యే

సీతానగరం: పెదబోగిలి మేజర్ పంచాయతీ పరిధిలో గల అప్పయ్యపేట గ్రామంలో ఎంపిటిసి బురిడి కుసుమ సూర్యనారాయణ ఆధ్వర్యంలో కొత్తగా వచ్చిన పింఛన్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వం పేదల కోసం అనేక సంక్షేమ పథకాలను ప్రవేశపెడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో కో ఆప్షన్ సభ్యులు షేక్ అబ్రహం, పాల్గొన్నారు.

భామిని : మండలంలోని చిన్నదిమిలి సచివాలయం పరిధిలోని గల కొరమ పంచాయతీలో కొత్తగా మంజూరైనా పింఛన్లను సోమవారం వైసిపి నాయకులు బొడ్డేపల్లి ప్రసాద్ రావు, అగుతముడి రఘుపతి నాయుడు, సచివాలయం కన్వీనర్ కొవ్వాడ చిరంజీవులు కొత్త పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో ఎన్నడూ లేని విదంగా అన్న మాట ప్రకారం రాష్ట్ర ప్రభుత్వం పింఛన్లు పెంచుతుందన్నారు. ఘనసరా పంచాయతీ పరిధిలోని కొత్తగా మంజూరైనా 11 పింఛన్లను నాయకులు కిల్లారి పాల్గుణరావు స్థానిక సచివాలయంలో అందజేశారు. ఈ కార్యక్రమంలో సెక్రటరీ నాగేశ్వరరావు, వెల్ఫేర్ అసిస్టెంట్ మోహన్

గుమ్మలక్ష్మీపురం : పేద ప్రజలకు మరింత అండగా నిలవాలనే ఉద్దేశంతో ఎన్నికల్లో ఇచ్చిన మాట ప్రకారం ప్రభుత్వం ప్రతినెలా ఇస్తున్న పింఛన్ నగదు రూ.2750కు పెంచి అందిస్తుందని తాడికొండ సర్పంచ్ మండంగి జగ్గారావు అన్నారు. పంచాయతీ పరిధిలో పలు గ్రామాల్లో ఉన్న లబ్ధిదారులకు పింఛన్లు అందజేశారు. కార్యక్రమంలో జెడ్‌పిటిసి సభ్యులు ఎం.రాధిక, వైసిపి నాయకులు గోపాల్ ఉన్నారు.

ఉపాధి పనులు కల్పించాలని ధర్నా

సీతానగరం : వికలాంగులకు ఉపాధి పనులు కల్పించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు రెడ్డి ఈశ్వరరావు డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద వికలాంగుల గ్రూపులు ధర్నా చేశాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధి హామీ చట్టం పనులు వికలాంగులకు కల్పించాలని, పనుల్లేక వికలాంగులు ఇబ్బందులు గురవుతున్నారని అన్నారు. ప్రభుత్వం పనులు కల్పిస్తామని చెప్తుంది తప్ప ఆచరణలో అమలు చేయలేదన్నారు. ఇప్పటికే పలుమార్లు నిడగల్లు, బూర్జ గ్రామాల్లో వికలాంగుల శ్రమ శక్తి గ్రూపులో ఆ సచివాలయాల దగ్గర నిరసన తెలియజేసిన ప్పటికీ పనులు ఇవ్వలేదన్నారు. తక్షణమే పనులు ఇచ్చి ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో సిఐటియు మండల కార్యదర్శి జి.వెంకటరమణ, వికలాంగుల సంఘం నాయకులు ఎం.త్రినాథ్, బి.భాస్కరరావు, ఉపాధి కూలీలు సత్యంనాయుడు, సిహెచ్ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.



ధర్నా చేస్తున్న వ్యవసాయ కార్మిక సంఘం, వికలాంగులు

ఎస్‌కెపాడు నర్సరీ పరిశీలన

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

ఉపాధి హామీ నిధులతో ఎస్.కెపాడు ఉద్యానవన కేంద్రం అభివృద్ధికి చర్యలు చేపడుతున్నట్లు ఎపిడి చంద్రమ్మ తెలిపారు. మండలంలో పలు అభివృద్ధి పనులను ఆమె సోమవారం పరిశీలించారు. ఇందులో భాగంగా ఎస్‌కె పాడు నర్సరీని పరిశీలించారు.ఉపాధి హామీలో ఏఏ పనులు చేపట్టవచ్చు అని పరిశీలించి ప్రణాళికలు తయారు చేస్తున్నట్లు ఆమె తెలిపారు. అవసరమైన పనులను గుర్తించి చేపడతామన్నారు. అనంతరం గుమ్మలక్ష్మీపురం ఆర్ఐటిఐ వెనుక భాగంలో జరుగుతున్న ట్రెంచ్ కట్టు పనులను పరిశీలించారు. టెక్నికల్ అసిస్టెంట్లతో సమావేశమై పనుల్లో తమ లక్ష్యాలు పూర్తిచేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఉపాధి హామీ ఎపిఒ శివరామకృష్ణ, వాటర్ షెడ్ విభాగం అధికారి రెడ్డి పోలినాయుడు తదితరులు పాల్గొన్నారు.



నర్సరీను పరిశీలిస్తున్న ఎపిడి చంద్రమ్మ

వైద్యుల పోస్టులు భర్తీ చేయాలి

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

స్థానికజిల్లా ఆస్పత్రిలో ఖాళీగా ఉన్న డాక్టర్, టెక్నికల్ సిబ్బంది పోస్టులను భర్తీ చేయాలని జనసేన నాయకులు ఐటిడిఎ పిఒ సి.విష్ణు చరణ్‌ను కోరారు. జనసేన జిల్లా నాయకులు పిఒను సోమవారం స్పందన కార్యక్రమంలో కలిసి ఆస్పత్రి సమస్యలపై చర్చించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లాలోని పేదలకు పెద్దదిక్కుగా ఉన్న ఆసుపత్రిలో కీలకమైన వైద్యాధికారులు, టెక్నికల్ సిబ్బంది పోస్టులు ఖాళీగా ఉండటంతో రోగులకు సరైన వైద్య సేవలందక ఇబ్బందులు పడుతున్నారన్నారన్నారు. నెలకు 400 వరకు ప్రసవాలు అవుతున్నా ఆసుపత్రిలో ఇద్దరే స్త్రీవైద్యనిపుణులు ఉండడంతో రోగులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. అలాగే కీలకమైన రేడియాలజీ, ఎనస్తియా, పాథాలజీ, జనరల్ మెడిసిన్, జనరల్ ఫిజీషియన్, బ్లడ్ బ్యాంక్ డాక్టర్‌తో పాటు ఆర్టీపిసిఆర్ టెక్నీషియన్లు, పిఎస్ఎ ఆక్సిజన్ ప్లాంటు టెక్నీషియన్లు, రేడియాలజీ టెక్నీషియన్లు, డిఆర్ఎలు తదితరులు లేక రోగులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. అలాగే ఉన్న డాక్టర్లు, వైద్య సిబ్బంది సమయపాలన పాటించకపోవడంతో ఆసుపత్రికి వెళ్లే రోగులు అవస్థలు పడుతున్నారన్నారు. ఇక్కడ వైద్యులు లేకపోవడం ఐసియు నిపుణులు లేకపోవడంతో విజయనగరం, విశాఖపట్నం రిఫరల్ చేస్తున్నారన్నారు. కావున తక్షణమే ఆసుపత్రిలో ఖాళీగా ఉన్న డాక్టర్లు, సిబ్బందిని నియమించాలన్నారు. కార్యక్రమంలో జనసేన నాయకులు రెడ్డి కరుణ, వి.దాలినాయుడు, నెయ్యిగాపులు సురేష్, మానేపల్లి ప్రవీణ్, సిరిపురపు గౌరీ శంకర్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి కల్పన శూన్యం

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

వైసిపి ప్రభుత్వం మూడేళ్లలో ఉద్యోగ, ఉపాధి కల్పనలేక నిరుద్యోగ యువత వైసిపి ప్రభుత్వం పట్ల అసంతృప్తితో యువత ఉందని కురుపాం నియోజకవర్గం టిడిపి సీనియర్ నాయకులు నందివాడ కృష్ణబాబు అన్నారు. గుమ్మలక్ష్మీపురంలో సోమవారం విలేకరులతో మాట్లాడారు. ఎన్నికలకు ముందు వైఎస్ జగన్ ప్రతి ఏడాది జాబ్ కేలండర్ తీసుకొచ్చి ఉద్యోగాలు భర్తీ చేస్తామని హామీ ఇచ్చారని ఈ ఎన్నికల హామీ ఏమైందని ఆయన ప్రశ్నించారు. గిరిజన అభ్యర్థులకు స్పెషల్ డిఎస్ సి, పోలీస్ రిక్రూట్మెంట్, కొత్త పరిశ్రమలు ఏర్పాటు లేవన్నారు. నిత్యవసర ధరల పెరుగుదలతో సామాన్య, మధ్యతరగతి ప్రజలు ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారన్నారు. రైతు సంక్షేమ ప్రభుత్వమని చెప్పుకుంటున్న రైతులు పండించే పంటలకు మద్దతు ధర లేకపోవడంతో తీవ్రంగా నష్టపోతున్నారని అన్నారు. ఏ వర్గం చూసినా ప్రభుత్వంపై తీవ్ర వ్యతిరేకత ఉన్నారని అన్నారు. ప్రభుత్వ వ్యతిరేక విధానాలను ప్రజల్లోకి తీసుకువెళ్లి ఎండగట్టడానికి టిడిపి యువ నాయకులు నారా లోకేష్ చేపట్టబోయే పాదయాత్రలో ప్రతి ఒక్కరూ పాల్గొని విజయంతం చేయాలని కోరారు.

విద్యార్థికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి - నెల్లిమర్ల

సతివాడలో అనారోగ్యంతో బాధపడుతున్న విద్యార్థికి, తోటి విద్యార్థులు, ఉపాధ్యాయులు ఆర్థిక సహాయం సోమవారం అందజేశారు. సతివాడ జెడ్‌పి ఉన్నత పాఠశాలకు చెందిన లెంక హరినాయుడు అనే పేద విద్యార్థి గత కొంతకాలంగా బోన్ క్యాన్సర్‌తో బాధ పడుతున్నాడు. దీంతో అదే పాఠశాలకు చెందిన తోటి విద్యార్థులు, ఉపాధ్యాయులు రూ. 35వేలు ఆర్థిక సాయం అందించారు. ఈ సాయాన్ని సర్పంచ్ రేవల్ల శ్రీనివాసరావు, ఎంపిటిసి రెడ్డి సత్య నారాయణ చేతుల మీదుగా అందజేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తోటి విద్యార్థికి సాయం చేయడం ఆనందంగా ఉందన్నారు.

ప్రతి ఒక్కరికీ వైద్యపరీక్షలు

ప్రజాశక్తి - కొమరాడ

అవసరమైన ప్రతి ఒక్కరికీ తప్పనిసరిగా ఆరోగ్య తనిఖీలు చేయాలని జిల్లా ఇమ్యునైజేషన్ ఇన్‌ఛార్జి అధికారి డాక్టర్ టి.జగన్ మోహన్‌రావు అన్నారు. మండలంలోని పరశురాంపురంలో నిర్వహించిన ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని ఆయన సందర్శించారు. రోగులకు అందుతున్న వైద్య సేవలను, ఆరోగ్య తనిఖీలను పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. అవసరమైన వారికి ఆరోగ్య తనిఖీలు తప్పనిసరిగా చేయాలన్నారు. తనిఖీలకు విచ్చేసిన పలువురి సందేహాలను జగన్మోహనరావు నివృత్తి చేశారు. తదుపరి పాఠశాలను, అంగన్వాడీ కేంద్రాన్ని సందర్శించి ఆరోగ్య పర్యవేక్షణ చేసి ఐదేళ్లలోపు పిల్లలకు వచ్చే ఆరోగ్య సమస్యలపై పలు సూచనలు చేసి రికార్డులను పరిశీలించారు. అనంతరం డిప్యూటీ డిఎంహెచ్ఒ డాక్టర్ ఎం.వినోద్ కుమార్ ఈ కార్యక్రమాన్ని సందర్శించి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో కొమరాడ పిహెచ్‌సి వైద్యాధికారి డాక్టర్ శిరీష, సర్పంచ్ మజ్జి సుజాత, కిరణ్ కుమార్, పంచాయతీ సెక్రటరీ , వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డాక్టర్ టి.జగన్ మోహన్‌రావు

ఏనుగులను తరలించారా?

ప్రజాశక్తి - కొమరాడ

మండలంలో ఆరేళ్లుగా తిష్ట వేసిన ఏనుగులు గుంపు కదలడంలేదని, అధికారులు తరలించేడెప్పుడని సిపిఎం నాయకులు కొల్లి సాంబమూర్తి, రైతు సంఘం, వ్యవసాయ కార్మికసంఘం నాయకులు ఉపేంద్ర, త్రినాధనాయుడు, శివున్నాయుడు ప్రశ్నించారు. సోమవారం స్థానిక విలేకరులతో వారు మాట్లాడుతూ ఏనుగులు వల్ల ఇప్పటికే 8మంది చనిపోగా రూ.3.5కోట్లు వరకూ పంట, ఆస్తి నష్టాలు సంభవించాయన్నారు. రైతులు, వ్యవసాయ కూలీలు పొలాలకు వెళ్లి పనిచేసుకోవాలంటే భయబ్రాంతులకు గురవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. మరోవైపు పార్వతీపురం మన్యం జిల్లాలోని పలు మండలాల్లో పెద్ద పులి ఆవులను, మేకలను చంపేయడంతో గిరిజన ప్రాంతాల్లో గిరిజనులు భయాందోళనకు గురవుతున్నారాన్నరు. ఇంత జరుగుతున్నా అధికారులు పట్టించుకోవడంలేదని విమర్శించారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి జంతువులను అటవీ ప్రాంతానికి తరలించాలని కోరారు.

రోడ్డు భద్రత ప్రమాదాలపై అవగాహన

ప్రజాశక్తి- సీతంపేట

మండలంలో భారతి ఇంటర్నేషనల్ స్కూల్లో పాలకొండ మోటార్ వెహికల్ సిఐ, సీతంపేట ఎస్ఐ నీలకంఠరావు ఆధ్వర్యంలో రోడ్డు సేఫ్టీ పై సోమవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ నీలకంటారావు మాట్లాడుతూ వాహనాలు ప్రయాణించేటప్పుడు ట్రాఫిక్ నిబంధనలు ప్రకారం నడపాలని అన్నారు. రహదారిపై నడిచేటప్పుడు ఇరువైపులా చూసుకొని నడవాలన్నారు. రోడ్డు ప్రమాదాలు నివారణకు ప్రజలు కూడా సహకరించాలని అన్నారు మితిమీరి వేగం తగ్గించాలని ఓవర్ లోడు వేయరాదని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ నవీన్, ఉపాధ్యాయులు మురళీమోహన్, అప్పలనాయుడు, మురళీ, దివాకర్ తదితరులు పాల్గొన్నారు

మాట్లాడుతున్న ఎస్ఐ నీలకంఠరావు



చిన బోగిలి, పెదబోగిలిలో గ్రామసభలు

ప్రజాశక్తి - సీతానగరం

మండలంలోని చినబోగిలి, పెదబోగిలి గ్రామాల్లో సోమవారం గ్రామ సభలను నిర్వహించినట్లు ఇఒపిఆర్‌డి కెకె వర్మ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ గ్రామ సభలలో గ్రామాల అభివృద్ధి, ఆర్థిక వనరులు, చెత్త తయారీ ద్వారా సంపద, చెరువులపై చాపలు పెంపకం, ఆస్తి వివరాలు పంచాయితీ పరిధిలో ఖాళీ స్థలాలపై ఆదాయం సమకూర్చుకోవడం వంటి అంశాలపై గ్రామ సభలో చర్చించామన్నారు. గ్రామ సభ ఆమోదం ద్వారా వాటిని అమలు చేసేందుకు ఈ గ్రామ సభలు నిర్వహిస్తున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో చినబోగిలి సర్పంచ్ కురుమాన రాధా శ్రీనివాసరావు ఎంపిటిసి బుజ్జి, ఇఒ జి. వెంకటరమణ, పెదబోగిలి సర్పంచ్ తేరేజమ్మ, ఉప సర్పంచ్ అరవింద్ కుమార్‌తో పాటు వాలంటీర్లు గ్రామ సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పాలకొండ రూరల్ : మండలంలోని లుంబూరు గ్రామ పంచాయతీ ఆవరణంలో సర్పంచ్ తిర్లంగి ఉపేంద్ర కుమార్ అధ్యక్షతన సోమవారం గ్రామ సభ జరిగింది. గరుగుబిల్లి రెవెన్యూ పరిధిలో ఉన్న జగనన్న కాలనీ లుంబూరు గ్రామ పంచాయతీలో ఉండాలని, అలాగే గ్రామ పంచాయితీలో ఉన్న గ్రామ కంఠం ఖాళీ ప్రదేశాల్లో గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో షాపింగ్ కాంప్లెక్స్ ఏర్పాటు చేయుటకు తీర్మానాలు గ్రామ సభ ఆమోదించింది. అలాగే కొత్తగా వచ్చిన 12 జగనన్న పింఛన్ల పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యూఎస్ ఎఇ ప్రవల్లిక, ఉప సర్పంచ్ పడాల రామచంద్రరావు, మాజీ సర్పంచులు రౌతు వాసుదేవరావు, స్వామిబాబు, నెల్లి నాగభూషణరావు, చోడవరపు కృష్ణ, పంచాయతీ కార్యదర్శి రాంబాబు, సచివాలయ, పంచాయతీ ఉద్యోగులు వాలంటీర్లు, గ్రామస్తులు పాల్గొన్నారు.



సభలో మాట్లాడుతున్న ఇఒపిఆర్‌డి వర్మ

పప్పల చీటి ఏజెంట్లపై ఒత్తిడి చేయొద్దు: డిఎస్‌పి

ప్రజాశక్తి - గుర్ల

పప్పుల చీటి ఏజెంట్లు పై సభ్యులు ఒత్తిడి తేవద్దని బొబ్బిలి డిఎస్‌పి మోహనరావు అన్నారు. గుర్ల పోలీసు స్టేషన్‌కు వచ్చిన ఆయనను సోమవారం పప్పుల చీటి ఏజెంట్ల కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల గుర్ల మండలానికి చెందిన పతివాడ శ్రీలేఖ, విజయనగరం మండలానికి చెందిన మజ్జి రమేష్ సుమారు 25 వేల మందిని సభ్యులుగా చేర్చి ప్రతి సభ్యుడు నుండి నెలకు రూ.300 చొప్పున వసూలు చేసి పరారైన సంగతి తన దృష్టికి వచ్చిందన్నారు. అప్పలరాజును అదుపులోకి తీసుకొని అతను నుంచి డబ్బులు రికవరీ చేసి భాదితులకు న్యాయం చేస్తామని అప్పటి వరకూ సభ్యులు సంయమనం పాటించాలని ఆయన కోరారు. నెల్లిమర్ల పారిశ్రామిక వాడలో అప్పలరాజుకు సంబందించిన రెండు వాటర్ ప్లాంటులు ఉన్నట్టు సమాచారం ఉందని, శ్రీలేఖకు సంబంధించిన ఆస్తి వివరాలను సేకరించి భాదితులకు న్యాయం చేస్తామన్నారు.



ఏజెంట్లతో మాట్లాడుతున్న డిఎస్‌పి మోహనరావు